'ప్రజాపాలన'తో అర్హులందరికీ ఆర్థిక చేయూత

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి
- తొర్రూరు, పెద్దవంగరలో దరఖాస్తుల స్వీకరణ



తొర్రూరు: ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

తొర్రూరు, డిసెంబర్ 28: అభయహస్తం 6 గ్యారెంటీలతో ప్రగతి పథం సకల జనహితం కానున్నదని, అర్హులందరికీ ఆర్థిక చేయూత అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఫత్తేపురం గ్రామంలో సర్పంచ్ సోమలక్ష్మి అధ్యక్షత నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం కొలువుదీరిందని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అర్హులకు కచ్చితంగా వర్తింప జేస్తామన్నారు. 2024 జనవరి 6 వరకు ప్రజాపాలనతో అభయహస్తం గ్యారెంటీలకు దరఖాస్తుల స్వీకరిస్తామన్నారు. మధ్య దళారులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వొద్దని, దరఖాస్తును కూడా ప్రభుత్వమే అందిస్తుందని, ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే నేరుగా ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు షేక్ అంకుశ్, డీసీవో ఖుర్షిద్, ఎంపీడీవో కుమార్, డీఈ మధుసూదన్, మెడికల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అలాగే తొర్రూరులోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, మండలంలోని పత్తేపురంలో కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే యశస్వినీరెడ్డితో కలిసి ఝాన్సీరెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. టీపీసీసీ మాజీ సభ్యుడు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అనుమాండ్ల నరేందర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తాం

పెద్దవంగర: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలు పక్కాగా అమలయ్యేలా లక్ష్యంతో పాలన కొనసాగుతున్నదని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి అన్నారు. మండలంలోని బావోజీతండా జీపీలో ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. అనంతరం గంట్లకుంటలో ఎరుకలి వెంకన్న తల్లిదండ్రులు రాములు, సోమక్క మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. మండల వ్యాప్తంగా 417 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జమున, మండల ప్రత్యేకాధికారి ఖుర్షిద్, తహసీల్దార్ మహేందర్, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీవో సత్యనారాయణ, ఏపీఎం రమణచారి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సురేశ్ పాల్గొన్నారు.

పేదలందరికీ ఆరు గ్యారెంటీలు

ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

నర్సింహులపేట, డిసెంబర్ 28: అర్హులైన పేదలందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలు అందిస్తుందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. గురువారం మండలంలోని పెద్దనాగారం స్టేజీ జీపీలో నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ముంగిమడుగు, బక్కతండా, వస్రతండా గ్రామాల్లో సర్పంచులు సోమిరెడ్డి, శంకర్‌గౌడ్, సీతారాంనాయక్, మగ్ది అధ్యక్షత గ్రామసభలు నిర్వహించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. మండలంలో ఇసుక అక్రమ రవాణా, గంజాయి లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. డ్రగ్స్ లేని రాష్ట్రంగా చేసేందుకు సీఎం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రెండు, మూడు గ్రామాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి ఐదుగురితో కమిటీ ఏర్పాటు చేశారన్నారు. పార్టీలకతీతంగా పేదలందరికీ లబ్ధి జరుగుతుందన్నారు.

గ్రామసభలో ఎమ్మెల్యే సతీమణి..

పెద్దనాగారం స్టేజీ జీపీలో ప్రజా పాలన గ్రామసభలో ఎమ్మెల్యే సతీమణి ప్రమీల పాల్గొనడం, ప్రొటోకాల్ ఉల్లఘించడంపై ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే సతీమణి గ్రామ సభలో కూర్చోవడం



దరఖాస్తులు స్వీరిస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి సుధాకర్, మండల అధికారులు సైతం నిల్చొవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రాజేందర్, తహసీల్దార్ వివేక్, ఎంపీడీవో భారతి, సర్పంచ్ సోమిరెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కురవి: ప్రజాపాలన ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ అన్నారు. సీరోలులో ప్రజా పాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఎంపీటీసీ భోజ్యానాయక్, కాంగ్రెస్ నాయకులు వీరభద్రం, కరుణాకర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

జిల్లా వైద్యాధికారి అంబరీష

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 28: నేటి ఆధునిక సమాజంలో పురుషులతో సమానంగా స్త్రీలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని జిల్లా వైద్యాధికారి అంబరీష అన్నారు. గురువారం జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా లెవల్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆడ పిల్లల రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టరీత్యా నేరమన్నారు. సమావేశంలో నాగవాణి, వెంకటేశ్, సీడీపీవోలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

బయ్యారం, డిసెంబర్ 28: రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి జిల్లా అధ్యక్షుడు వీరు నాయక్ ప్రభుత్వాన్ని కోరాడు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన టీఎస్‌టీటీఎఫ్ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో 317 ద్వారా వివిధ జిల్లాలకు బదిలీ అయిన ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు బదిలీ, పదోన్నతులు కల్పించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంత టీచర్లకు జీవో నంబర్ 3 ద్వారా పదోన్నతులు కల్పించాలని, పీఆర్సీ ఫిట్‌మెంట్, పాత పెన్షన్ విధానం, భాషా పండిత్, వ్యాయామ ఉపాధ్యాయుల పదోన్నతి వంటి సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రధాన కార్యదర్శి భద్రూనాయక్, అధ్యక్షుడు బావ్‌సింగ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రంగయ్య, రవీందర్, రామారావు, చిరంజీవి ఉన్నారు.

విద్యతోనే సమాజంలో గౌరవం

స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఇనుగుర్తి, డిసెంబర్ 28: విద్యతోనే సమాజంలో గౌరవం ఉంటుందని నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ డైరెక్టర్ జాటోత్ జయకృష్ణ అన్నారు. మండలంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో హెచ్ఎం రూపారాణి ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ పరీక్షకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు గురువారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన జీవితానికి విజయం అందించే నావ చదువని, దానిపైనే ప్రతేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వలంటీర్ గుగులోత్ దేవేందర్, పాఠశాల ఉపాధ్యాయులు కొమ్ము రాజేందర్, యకయ్య, సమ్మిరెడ్డి, యాదగిరి, ప్రవీణ్, శీరిష పాల్గొన్నారు.

గోదాదేవి పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

అలరించిన గోదాదేవి పల్లకీ సేవ

మరిపెడ, డిసెంబర్ 28: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని వైష్ణవ ఆలయాల్లో గురువారం తిరుప్పావై ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కేంద్రంలోని సీతారామాలయంలో గోదాదేవి పల్లకీ సేవను భక్తులు కనుల పండువగా నిర్వహించారు. తొలుత మహిళలు మంగళ హారతులు, తిరుప్పావై ప్రవచనాలతో కీర్తించారు. ఆలయ పురవీధుల్లో పల్లకీ సేవ, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేశారు.

ఎఫ్ఎల్ఎన్ సమావేశం

కురవి, డిసెంబర్ 28: కురవి, సీరోలు మండలాల్లోని పీఎస్, యూపీఎస్, జడ్పీహెచ్ఎస్ పాఠశాల హెచ్ఎంలకు ఎఫ్ఎల్ఎన్ సమావేశం గురువారం నిర్వహించారు. ఏఎంవో చంద్రశేఖర్ ఆజాద్ హాజరై మాట్లాడారు. ఎఫ్ఎల్ఎన్ ఉన్నతిపై అనేక సూచనలు చేశామన్నారు. నోడల్ అధికారులు బాలాజీ, లచ్చిరాం, హెచ్ఎంలు ఎండీ వహీద్ పాల్గొన్నారు.

సర్వే వాయిదా

డోర్నకల్, డిసెంబర్ 28: గొల్లచర్ల గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 352లో ఉన్న భూమి సర్వేను గురువారం వక్ఫ్‌బోర్డు, రెవెన్యూ అధికారులు వాయిదా వేశారు. వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ జమీరుద్దీన్, రెవెన్యూ సర్వేయర్ వెంకట్, ఆర్ఐ రామ సంయుక్త సర్వేకు భూ సంబంధత రైతులు సహకరించకపోవడంతో వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు.

'రాష్ట్రస్థాయి నెట్‌బాల్'కు మోడల్ స్కూల్ విద్యార్థుల ఎంపిక

నర్సింహులపేట, డిసెంబర్ 28: మండలంలోని మోడల్ స్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మల్లేశ్వరావు గురువారం తెలిపారు. ఈనెల 30, 31, జనవరి 1న నాగార్జున సాగర్‌లో జరిగే 6వ రాష్ట్రస్థాయి జూనియర్ నెట్‌బాల్ పోటీలకు పాఠశాలకు చెందిన డీ పూర్ణిమ, వేముల నిత్య, ఏ హరిత, బీ నవ్యశ్రీ, బీ చందన, బీ రఘు, డీ ఇసాక్ ఎంపికైనట్లు పీడీ ఎం శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు. ప్రతిభ చూపి జాతీయ స్థాయిలో పాల్గొనాలని, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

రహదారిపై మరమ్మతులు

బయ్యారం, డిసెంబర్ 28 : మండలంలోని ఎన్‌హెచ్-930 పీ జాతీయ రహదారిపై గురువారం అధికారులు మరమ్మతులు చేశారు. గంధంపల్లి సబ్‌స్టేషన్ వద్ద రోడ్డు గుంతలమయంగా మారి, ప్రమాదాలు జరుగుతుండడంతో ఇటీవల మండల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే కే కనకయ్యకు స్థానిక నాయకుడు ప్రవీణ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు తెలిపారు. వెంటనే ఆయన ఎన్‌హెచ్ అధికారులకు ఫోన్‌చేసి మరమ్మతులు చేయాలని ఆదేశించడంతో పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా రిజిస్ట్రార్ రవి జన్మదిన వేడుకలు

తొర్రూరు, డిసెంబర్ 28: మండల కేంద్రంలోని జాతీయ మాల మహానాడు కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు పిల్ల సుధాకర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి డివిజన్ అధ్యక్షుడు గొడిశాల నవీన్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా రవి సేవలను ప్రముఖులు కొనియాడారు. కార్యక్రమంలో మాల మహానాడు పోలిట్ భ్యూరో చైర్మన్ యశోదా భాస్కర్, జిల్లా నాయకులు బొడ్డు అశోక్, శంకర్, జిల్లా అధికార ప్రతినిధి చిట్టిమల్ల మహేశ్, జిల్లా ప్రచార కార్యదర్శి చెదల యాకాంతం, తొర్రూరు డివిజన్ అధ్యక్షుడు గొడిశాల నవీన్, మండల నాయకులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ సోదరుడు గుగులోత్ కిషన్‌నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, చిత్రంలో ఎమ్మెల్సీ సత్యవతి

అద్దె బస్సుల ఓనర్లను ఆదుకోవాలి

తొర్రూరు, డిసెంబర్ 28: అద్దె బస్సుల ఓనర్లను ప్రభుత్వం ఆదుకోవాలని అద్దె బస్సుల ఓనర్స్ అసోసియేషన్ వరంగల్ రీజినల్ అధ్యక్షుడు మారుపెల్లి రామిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్టీసీ డిపో మేనేజర్ పరిమళకు అద్దె బస్సుల తొర్రూరు డిపో అధ్యక్షుడు హనుమాండ్ల రామిరెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించిందన్నారు. చెయ్యి ఎత్తిన చోట బస్సు ఆపిన క్రమంలో కెపాసిటీకి మించి ప్రయాణికులు ఎక్కడంతో అధిక లోడు భారంతో కేఎంపీఎల్ కోల్పోతున్నామని, టైర్ పంచర్, ఇతర రిపేర్లు వస్తున్నాయన్నారు. దీంతో అద్దె బస్సుల ఓనర్లు నష్టపోవాల్సి వస్తుందని, ఆర్టీసీ యాజమాన్యం అద్దె బస్సుల ఓనర్లను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా డీఎం స్పం దించి విషయాన్ని పై అధికారులకు తెలుపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హై ర్ బస్సు ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జన్నపురెడ్డి వెంకటరెడ్డి, సభ్యులు సు ధాకర్, హనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

డీఎం పరిమళకు వినతిపత్రం ఇస్తున్న అద్దె బస్సుల ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం

మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 28: ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రజాపాలన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నదని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని మాధవ కమ్యూనిటీ హాల్, ఒకటో వారులో ఈదులపూసపల్లి, మండల పరిధిలోని సాదుతండాలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమాలకు ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసేందుకు ప్రజాపాలన ద్వారా ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. దరఖాస్తులను సైతం పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వమే అందిస్తుందని, ప్రభుత్వం నిరుపేదలకు సంక్షేమ ఫలాలు అందించాలనే లక్ష్యంతోనే ప్రజా పాలన ప్రవేశ పెట్టిందన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : ఎస్పీ

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 28: జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్ హెచ్చరించారు. గురువారం టౌన్ పోలీస్ స్టేషన్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో జిల్లా పోలీస్ వార్షిక నివేదికను ఆయన వెల్లడించారు. 2023 సంవత్సరంలో జిల్లాలో 10 హత్య కేసులు, 223 ఆస్తి సంబంధిత నేరాలు, 6 నేరపూరిత హత్యలు, 51 కిడ్నాప్ కేసులు, 44 రేప్‌లు, 474 గాయాల కేసులు, 202 మోసపూరిత నేరాలు, 56 ఎస్సీ, ఎస్టీ కేసులు, 58 పోక్సో

మాట్లాడుతున్న ఎస్పీ సంగ్రామ్‌సింగ్ పాటిల్

చట్టం కింద, 10 గంజాయి కేసులు, 51 సైబర్ నేరాలు, 117 మహిళలపై అఘాయిత్యాల కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. గతేడాదితో పోల్చితే ఆస్తి సంబంధిత నేరాలు, గాయాల కేసులు, మహిళల పై అఘాయిత్యాలు, సైబర్ నేరాలు పెరిగాయని, హత్య, కిడ్నాప్, పోక్సో, మోసపూరిత కేసులు తగ్గాయన్నారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పాత నేరచరిత గల 6,205 మందిని బైండోవర్ చేశామన్నారు. పోలీస్ గ్రామ సందర్శన, అవగాహన పోగ్రాం, పోలీస్ పెట్రోలింగ్ చేయడం ద్వారా కమ్యూనిటీ గ్రూపుల మధ్య తగాదాలను తగ్గించామన్నారు. నిషేధిత మావోయిస్టులపై, గంజాయి స్మగ్లింగ్‌పై, అక్రమ వ్యాపారాలపై ఉక్కుపాదం మోపామన్నారు. సమావేశంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

వినూత్న పద్ధతిలో బోధించాలి : డీఈవో

నెల్లికుదురు, డిసెంబర్ 28: విద్యార్థుల బంగారు భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని, వారికి అర్థమయ్యేలా వినూత్న పద్ధతిలో బోధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు అన్నారు. గురువారం మండలంలోని పెద్దతండా ప్రాథమిక పాఠశాల, కాచికల్ ప్రాథమికోన్నత పాఠశాల, మెచరాజుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అకస్మిక తనిఖీ చేశారు. ఎఫ్ఎల్ఎన్ అమలు, ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పట్టిక, పాఠశాల నిర్వహణ రికార్డులను పరిశీలించారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ.. ఎఫ్ఎల్ఎస్‌కు అనుగుణంగా బోధించాలన్నారు. ఎంపీడీవో శేషాద్రి, తహసీల్దార్ రాజు, మండుల శ్రీరాములు, పాఠశాల హెచ్ఎం జే మంగతా యి, మహేందర్ రెడ్డి, దర్గా హుస్సేన్ పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలిస్తున్న రామారావు

అయోధ్య శ్రీరామ అక్షింతలకు ఘన స్వాగతం

తొర్రూరు/కేసముద్రం/మరిపెడ/గూడూరు, డిసెంబర్ 28 : అయోధ్యలో జనవరి 22న ప్రారంభంకానున్న శ్రీరాముడి ఆలయం నుంచి వచ్చిన శ్రీరాముడి స్పర్శా అక్షింతలతో గూడూరు మండల కేంద్రంలో గురువారం ఉరేగింపు తీశారు. అయోధ్య రామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్టు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డప్పుచప్పుళ్లతో నగర సంకీర్తన చేస్తూ జిల్లా కేంద్రం నుంచి తీసుకువచ్చిన అక్షింతలు గల కలశాలకు ట్రస్టు బాధ్యులు స్వాగతం పలికారు. అనంతరం స్థానిక లక్ష్మీనారాయణ ఆలయంలో కలశాలను భద్రపరిచారు. జనవరి 1 నుంచి 15 వర కు అక్షింతలను ప్రతి గ్రామానికి చేర్చి ప్రతి గడప గడపకూ అందించనున్నట్లు బాధ్యులు కృష్ణమూర్తి తెలిపారు. నరేశ్, కృష్ణమూర్తి, వెంకటరమణాచార్యులు పాల్గొన్నారు. అలాగే మరిపెడ మండలంలో ఇంటింటికీ రాములోరి అక్షింతలు పంపిణీ చేయనున్నారు. కాగా, బుధవారం మున్సిపల్ కేంద్రంలోని వరంగల్-ఖ మ్మం జాతీయ రహదారిపై రాములోరి అక్షింతలను జై శ్రీరాం నినాదాల మధ్య ఊరేగింపు తీశారు. కృష్ణ, రమేశ్, శ్రీను, వుల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే అయోధ్య శ్రీరాముడి అక్షింతలు కేసముద్రం మండలానికి

గూడూరు: అక్షింతలతో ఉరేగింపు చేస్తున్న భక్తులు

చేరుకోగా, రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి భద్రపరిచారు. ఓలం శ్రీనివాస్, ఉపేందర్, వాసుదేవచార్య, రవీందర్‌రెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు. తొర్రూరు మండల కేంద్రానికి దేశ వ్యాప్తంగా పంపిణీ చేయనున్న అయోధ్య రాములోరి ఆహ్వాన పత్రిక, రామాలయం ఫొ టో, అక్షింతలు గురువా రం చేరుకున్నాయి. అనంతరం వేంకటేశ్వర ఆలయంలో భద్రపరిచారు. ఆలయ పూజారి శ్రీకాంత్, విశ్వ హిందూ పరిషత్ జిల్లా గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ, వికాస తరంగిణి బాధ్యులు ప్రసూన, ప్రభావతి, రాంబాబు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

వరి నారుమడుల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

నర్సింహులపేట, డిసెంబర్ 28 : వరి నా రుమడుల్లో చలి ప్రభావం పడకుండా రైతు లు జాగ్రతలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఏవో రామకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని వస్రతండా జీపీ పరిధిలో వరినారును ఆయ న పరిశీలించి మాట్లాడారు. యా సంగి సాగు లో రైతులు ఎక్కువగా సన్న గింజ రకాల సాగువైపు మొగ్గు చూపుతున్నారని, చలి ప్రభావం నారు మళ్లపై పడకుండా ప్రత్యేక నారుమడి యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. నారు పోసుకునే ముందు నారుమడికి సరిపడా సుమారు 2 క్వింటాళ్లు బాగా మాగిన పశువుల ఎరువు, కోళ్ల ఎరువు, కిలో జింక్ సల్ఫేట్ తప్పని సరిగా వేసుకోవా లి. ప్రతిరోజూ పొద్దుగాల, పగటిపూట వెచ్చ ని నీటిని పెట్టి సాయంత్రం తీసివేయాలి. కా గా చలి తీవ్రత పెరిగి నారు ఎర్రబడడం, సరిగ్గా ఎదగకపోవడం పంట కాలం పెరిగిపోవడం, పోషక లోపాలు ముఖ్యంగా జింక్ లోప లక్షణాలు కనిపించే అవకాశం ఉన్నది. జింక్ లోపం వల్ల ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడుతాయి. వీటి నివారణకు లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేసుకోవాలి. చలి తీవ్రత ఎక్కువగా ఉంటే స్వర్ణఫాల్, పార్ములా 4వంటి సూక్ష్మపోషకాల మిశ్రమాన్ని 5 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి. కాండం తొలిచే పురుగు బారినుంచి నారును కాపాడుకునేందుకు, నారు తీయడానికి వారం రోజుల ముందు, 5సెంట్ల నారుమడికి 800గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు వేయాలి. చలి తీవ్రత ఎక్కువగా ఉంటే అగ్గి తెగులు ఆశించే అవకాశమున్నది. ముందు జాగ్రత్తగా లీటరు నీటికి 0.6గ్రాముల ట్రైసైక్లోజోల్‌ను కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సీతారాం నాయక్, రైతులు రాములు, వెంకన్న, నరేశ్ శ్రీను ఉన్నారు.

'ప్రజా పాలన'కు దరఖాస్తుల వెల్లువ

జిల్లాలో గ్రామసభల్లో స్వీకరించిన ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు

డోర్నకల్: దరఖాస్తు తీసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ వీరన్న, కమిషనర్ అలీ

కురవి, డిసెంబర్ 28: కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనకు సంబంధించిన ఆరు గ్యారెంటీల కోసం గురువారం జిల్లాలోని గ్రామాలు, మండల, వార్డులు, జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యదర్శులు, అధికారులు ప్రారంభించి దరఖాస్తులను స్వీకరించారు. కురవిలో ఎంపీపీ గుగులోత్ పద్మా రవినాయక్ ప్రారంభించగా, అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. సీరోలు మండలంలో ప్రజాపాలన దరఖాస్తులు అధికారులు స్వీకరించారు.

ఇబ్బందులు లేకుండా చూడాలి: డీపీవో

చిన్నగూడూరు: ప్రజాపాలన గ్రామ సభ ల్లో దరఖాస్తు దారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని డీపీవో హరిప్రసాద్ అన్నారు. మండలంలోని గుండంరాజుపల్లిలో ఉదయం, పగిడిపల్లి గ్రామంలో సాయంత్రందారఖాస్తులను స్వీకరించారు. జీపీలో నిర్వహించిన కార్యక్రమాన్ని డీపీవో పరిశీలించి మాట్లాడారు. 28 నుంచి జనవరి 3 వరకు గ్రామ సభల్లో దరఖాస్తులను అధికారులకు అందించాలన్నారు. తొలిరోజు గుండంరాజుపల్లిలో 253, పగిడిపల్లిలో 119 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

పథకాలను వినియోగించుకోవాలి

కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని ఎంపీపీ చంద్రమోహన్, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని సబ్‌స్టేషన్ తండా, సర్వాపురం, బుచ్చనాయక్ తండాల్లో ప్రజాపాలన ప్రారంభించారు.

డోర్నకల్‌లో..

డోర్నకల్: మున్సిపాలిటీలోని 15 వార్డుల్లో ప్రజాపాలన దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. 5వ వార్డు రాజు తండాలో కౌంటర్‌ను మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న ప్రారంభించి మాట్లాడారు. మొదటి రోజు 873 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మున్వర్ అల